www.prajasakti.com

ప్రజాశక్తి

ఆదివారం 22 అక్టోబర్ 2023

నేటి నుంచి దసరా సంబరాలు

115 ఏళ్లుగా కొనసాగుతున్న ఆనవాయితీ

ప్రజాశక్తి - నూజివీడు అర్బన్

నూజివీడులో దసరా ఉత్సవాలు 115 సంవత్సరాలుగా కొనసాగుతున్నాయి. నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ ద్వారా అఖిల భారత చెడుగుడు పోటీలు, దసరా ఉత్సవాలు ప్రతియేటా అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది 71వ వార్షిక అఖిల భారత చెడుగుడు పోటీలు పురుషులు, మహిళల ఆహ్వాన కబడ్డీ పోటీలు నిర్వహించనున్నారు. దాతల ఆదరణ, ప్రజల ప్రోత్సాహంతో దసరా ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు నూజివీడు స్పోర్టింగ్ క్లబ్ అధ్యక్షులు రామిశెట్టి మురళీకృష్ణకుమార్ తెలిపారు. ఈ నెల 22న ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 23న చెడుగుడు, కబడ్డీ పోటీలు ప్రారంభమవుతాయని చెప్పారు. అదేరోజు రాత్రి దసరా ఉత్సవాల ర్యాలీ ప్రారంభమవుతుందని, 25న విజేతలకు బహుమతి ప్రదానం నిర్వహిస్తామని వివరించారు.

కరెంటు రాదు.. చినుకు రాలదు..!

- 9 గంటల విద్యుత్ సరఫరా లేక ఎండుతున్న పొలాలు
- దిగుబడులపై ప్రభావం తప్పదని రైతుల ఆందోళన

వరి పంటకు సాగునీరందక మండలంలో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతోపాటు వ్యవసాయానికి తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా సక్రమంగా లేక రైతులకు సాగునీటి కష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది లోటు వర్షపాతం సార్వా సాగును దెబ్బతీస్తోంది.

నీరు లేక బీటలు తీసిన వరిచేను

ఎదగని వరి చేను

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలో మెట్ట ప్రాంతంలో 9740 ఎకరాల్లో వరి, 642 ఎకరాల్లో మినుములు, 30 ఎకరాల్లో వేరుశెనగ, 162 ఎకరాల్లో చెరకు పండిస్తున్నారు. వీటిలో నాచుగుంట, వెల్లమిల్లి, ఉంగుటూరు తదితర గ్రామాల్లో ఇప్పటి వరకూ 289 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. కొన్ని ఈనిక దశ, మరికొన్ని గింజ గట్టిపడే దశలో ఉన్నాయి. ఈ రెండు దశల్లో సాగునీటికి ఎంతో ప్రాధాన్యత ఉంది. ఈ దశ నుంచి గట్టెక్కితేనే వరి కోతలు ప్రారంభమవుతాయి. సరిగ్గా ఈ దశలో వ్యవసాయానికి తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా సక్రమంగా అమలు కాకపోవడంతో వరి పొలాలు నీరు లేక ఎండిపోతున్నాయి. అదే సమయంలో వర్షాభావ పరిస్థితులు రైతన్నను మరింత కుంగదీస్తున్నాయి.

దిగుబడిపై సన్నగిల్లుతున్న ఆశలు

వరికి సాధారణంగా నీటి సౌకర్యం పుష్కలంగా ఉండాలి. నారుమడులు సిద్ధం చేసినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకూ నీరుండాలి. వరి కోతలు కోసే సమయానికి రెండు వారాల ముందు వరకూ నీటి తడులు పెట్టాలి. మొన్నటి వరకూ ఏడు గంటలు విద్యుత్ సరఫరా ఉంది. రైతుల ఆందోళనతో గంట పెంచి ఎనిమిది గంటలు ఇస్తున్నారు. దాన్ని నిరంతరం తొమ్మిది గంటలు చేయాలని, లేకుంటే పంటలు దెబ్బతినే ప్రమాదం ఉందని సాగుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాలు పోసుకుని గింజ గట్టిపడే తరుణంలో నీరు లేకపోతే దిగుబడులు ఎకరానికి రెండు నుంచి ఐదు బస్తాలు తగ్గుతుందని, కౌలుదారులు, రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని లబోదిబోమంటున్నారు.

బీటలు వారిన పొలం.. దిగుబడులపై ప్రభావం

పర్వతనేని పద్దయ్య, రైతు, అక్కుపల్లిగోకవరం

అక్కుపల్లిగోకవరంలో సొంతం పది ఎకరాల్లో వరి పండిస్తున్నాం. తగినంత వర్షాలు లేకపోవడంతో బోర్లు నీటిపై ఆధార పడాల్సి వచ్చింది. దానికితోడు వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో అవాంతరాలతో పంట ఎంతవరకు పండుద్దో అనే అనుమానం ఉంది. నీటి కొరత కారణంగా దిగుబడి తగ్గిపోతుందని అనుమానంగా ఉంది. ఇప్పటికైనా ఆటంకం లేకుండా తొమ్మిది గంటలు విద్యుత్ సరఫరా చేయాలి.

పొలాలు ఎండిపోతున్నాయి

సింహాద్రి సత్యనారాయణ, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు

బోర్ల కింద పలు చేలకు నీరు సరిపోక నెర్రలు ఇస్తున్నట్లు చాలా మంది రైతులు మా దృష్టికి తెచ్చారు. వ్యవసాయ సలహా మండలి జిల్లా సమావేశంలో ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. రైతులను ఆదుకునేలా ప్రభుత్వం, అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రైతులు ఆందోళన చెందొద్దు.

14 ఎకరాల్లోనే నీటిఎద్దడి

బాలిక వెంకటేశ్, మండల వ్యవసాయాధికారి, ఉంగుటూరు

ఉంగుటూరు, నీలాద్రిపురం, నాచుగుంటలో బోర్ల కింద పొలాలకు సాగునీటి కొరత ఉన్నట్లు పలువురు రైతులు ఫిర్యాదు చేశారు. వాటిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేశాం. నివేదికను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయితే రైతులు ఆందోళన చెందాల్సినంతగా సమస్య లేదు.

జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డిఐజి, ఎస్పి

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

డిఐజి అశోక్‌కుమార్, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

శాంతిభద్రతల పరిరక్షణకు అనునిత్యం తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పని చేస్తూ అశువులు బాసిన పోలీసు అమర వీరులను నిత్యం మనం స్మరించుకోవాలని, వారి త్యాగాలు మరువలేనివని ఏలూరు రేంజ్ డిఐజి జివికె.అశోక్‌కుమార్ తెలిపారు. స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో పోలీస్ అమరవీరుల స్మృతి దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథులకు పోలీస్ సిబ్బంది గౌరవ వందనం చేశారు. ఈ సందర్భంగా డిఐజి మాట్లాడుతూ రోజంతా ప్రజాసేవలో శ్రమించేది ఒక్క పోలీస్ మాత్రమేనని అన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అండగా నిలుస్తూ శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వపరంగా ఆదుకుంటూ రాయితీలు, కారుణ్య నియామకాలపైనా ప్రభుత్వానికి నివేదిస్తామని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం, సమాజ శ్రేయస్సుకు విధి నిర్వహణలో అశువులు బాసిన పోలీసు అమరులను స్మరించుకోవడం మన బాధ్యత అని, వారు చేసిన త్యాగాలు, సేవలు మరువలేనివని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. పోలీసు అమరవీరుల స్తూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి అమరవీరులకు కలెక్టర్ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన రక్షకభటుల వీరత్వాన్ని మన దేశం ఎల్లప్పుడూ స్మరిస్తుందన్నారు. వారిని స్మరించుకుంటూ పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రతియేటా అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల దినోత్సవాన్ని దేశం మొత్తం జరుగుతుందన్నారు. 1959 అక్టోబర్ 21న చైనా సైనికులను ఎదిరించి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాడిన పోలీసు వారి ధైర్యాన్ని, త్యాగాన్ని అమరవీరుల స్మారక దినంగా మన దేశం గత 62 ఏళ్లుగా గుర్తు చేసుకుంటూ, వారి సేవలను స్మరించుకోవడం జరుగుతుందన్నారు. దేశంలో శాంతిభద్రతలను కాపాడుతూ దేశాభివృద్ధి కోసం ప్రాణత్యాగం చేసిన వారందరికీ మనం ఎంతో రుణపడి ఉన్నామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్‌తోపాటు అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ పూజ, ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాస్, ఎఆర్ అదనపు ఎస్‌పి ఎస్ఎస్.శేఖర్, ఎఆర్ ఆర్ఐ పవన్‌కుమార్ పాల్గొన్నారు. ఎస్‌పి మేరీ ప్రశాంతి మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగమంటే క్రమశిక్షణ, చిత్తశుద్ధి, అంకితభావం, త్యాగానికి నిదర్శనంగా నిలుస్తాయని చెప్పారు. విధి నిర్వహణలో అనేక ఒత్తిళ్లను అధిగమిస్తూ పని చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పి కరణంకుమార్, ఎఎస్‌పి ఎంజెవి.భాస్కరరావు, ఎఆర్ ఎఎస్‌పి శేఖర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు, డిటిసి డిఎస్‌పి కె.ప్రభాకరరావు, ఎఆర్ ఆర్ఎస్ఐ పవన్‌కుమార్, ఏలూరు ట్రాఫిక్ సిఐ వరప్రసాద్, ఏలూరు దిశ సిఐ విశ్వం, ఎస్‌బి సిఐ ఎం.సుబ్బారావు, డిసిఆర్‌బి సిఐ దుర్గాప్రసాద్, పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు నాగేశ్వరరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భారీ ర్యాలీ

పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్ నుంచి అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారీ ర్యాలీని ఏలూరు రేంజ్ డిఐజి అశోక్‌కుమార్, జిల్లా ఎస్‌పి ప్రశాంతి జెండా ఊపి ప్రారంభించారు. అమీనాపేట నుంచి ప్రభుత్వాసుపత్రి సెంటర్, ఫైర్ స్టేషన్ సెంటర్, ఎన్ఆర్‌పేట, జెడ్‌పి కార్యాలయం, కలెక్టరేట్ మీదుగా పెరేడ్ గ్రౌండ్‌కు చేరుకుంది.

'వాచాతి' విజయం ప్రజా ఉద్యమాలకు స్ఫూర్తి

గిరిజనులపై హింస, అకృత్యాలను ఐక్యంగా ఎదిరించాలి - వాచాతి గిరిజనుల విజయోత్సవ సభలో వక్తలు

ప్రజాశక్తి - ఏలూరు

తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లా వాచాతి గ్రామ గిరిజనులు తమపై పోలీసు, రెవెన్యూ, అటవీ అధికారులు బనాయించిన అక్రమ కేసులు, మహిళలపై జరిపిన అత్యాచారాలు, అకృత్యాలపై 31 సంవత్సరాలు పోరాడి విజయం సాధించారని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎ.రవి చెప్పారు. స్థానిక ఉద్దరాజు రామం భవనంలో వాచాతి విజయోత్సవ సభను శనివారం ఏపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించారు. సభలో రవి మాట్లాడుతూ 1992 జూన్ 20న తమిళనాడులోని వాచాతి గిరిజన గ్రామంపై అటవీ, రెవెన్యూ, పోలీసు అధికారులు ఎర్రచందనం స్మగ్లర్లతో కుమ్మక్కై గిరిజనులపైన, గిరిజన మహిళలపై అత్యంత నీచంగా, కీచకంగా చెప్పడానికి వీల్లేని విధంగా వ్యవహరించి దుర్మార్గాలకు పాల్పడ్డారన్నారు. 31 సంవత్సరాలుగా తమిళనాడు రైతుసంఘం, గిరిజన సంఘం, మహిళా సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, వివిధ ప్రజా సంఘాలు, సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున న్యాయ పోరాటం చేశారని గుర్తు చేశారు. ఫలితంగా అకృత్యాలకు పాల్పడిన 215 మంది అటవీ, పోలీస్, రెవెన్యూ అధికారులకు శిక్ష విధిస్తూ బాధిత ప్రతి గిరిజన కుటుంబానికి రూ.10 లక్షలు నష్టపరిహారం ప్రకటిస్తూ చెన్నయ్ హైకోర్టు ఇటీవల చారిత్రాత్మక తీర్పు ఇచ్చిందని చెప్పారు. గిరిజనులు, దళితులు, మహిళలపై దాడులు, అత్యాచారాలకు వ్యతిరేకంగా జరుగుతున్న ప్రజా ఉద్యమాలకు వాచాతి గ్రామ గిరిజనుల పోరాటం స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, నాయకులు పి.కిషోర్, శ్రామిక మహిళా నాయకురాలు కె.విజయలక్ష్మి, చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ పి.ఆదిశేషు మాట్లాడారు. కార్యక్రమంలో ఎ.శ్యామలారాణి, పి.గోపి, ఎస్.సత్యనారాయణ, మావూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎ.రవి

ఉద్యోగుల స్పందనకు 9 అర్జీలు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి శనివారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించి తొమ్మిది అర్జీలు అందాయని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ చెప్పారు. స్థానిక జిల్లా కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన ఉద్యోగుల స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణితో కలిసి వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ, విద్యాశాఖ, హౌసింగ్, గ్రామ, వార్డు సచివాలయ తదితర శాఖలకు సంబంధించిన మొత్తం తొమ్మిది అర్జీలు అందాయి. ఈ అర్జీలను తక్షణం పరిష్కరించాలని డిఆర్ఒ, జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డిఆర్ఒ ఎం.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్

విద్యుత్ ఛార్జీలు తగ్గించాలని ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

వినతిపత్రం అందిస్తున్న నేతలు

పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని కోరుతూ సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన శనివారం స్థానికంగా ర్యాలీ నిర్వహించి అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ధర్నానుద్దేశించి నాయకులు కారం రాఘవ, టి.బాబూరావు, ఇ.భూషణం, వి.భారతి మాట్లాడారు. ఎన్నికల ముందు అధికారంలోకి రాగానే విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని, 200 యూనిట్ల వరకు అందరికీ విద్యుత్ ఉచితంగా ఇస్తామని వైసిపి మాట ఇచ్చి నమ్మకద్రోహానికి పాల్పడిందన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు మీటర్ల బిగింపు యోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం వినతిపత్రాన్ని డిప్యూటీ తహశీల్దార్ రమేష్‌కు అందజేశారు. తొలుత ఆ పార్టీ కార్యాలయం నుంచి బస్టాండ్, నెహ్రూబొమ్మ సెంటర్ మీదుగా తహశీల్దార్ కార్యాలయం వరకూ సాగింది. కార్యక్రమంలో కొమరం నాగార్జున, గురుగుంట్ల బాబూరావు, మలచి బుల్లబ్బాయి, మామిడి మురళి, కె.కన్నారావు, పి.నూకరాజు, కె.వెంకటస్వామి, ప్రకాష్ పాల్గొన్నారు.

పొలాల్లో రైతులు.. సమీక్షల్లో ప్రభుత్వ యంత్రాంగం

'ఆలూ లేదు.. చూలూ లేదు.. కొడుకు పేరు సోమలింగం' చందంగా జిల్లాలోని ప్రజాప్రతినిధులు, అధికారుల తీరు తయారైందని రైతులు అగ్గిమీద గుగ్గిల మవుతున్నారు. సాగునీటి సమస్య తీవ్రమై పంటలు ఎండిపోతుంటే అధికారులు ధాన్యం కొనుగోలు ఏర్పాట్లపై సమీక్షల్లో మునిగి తేలుతుండడంపై అంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఏలూరులో జరిగిన సమావేశంలో కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అసంతృప్తి, పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామా నాయుడు పోడూరు, యలమంచిలి మండలాల్లో పర్యటన సాగునీటి సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. అధి కార పార్టీ ఎంఎల్ఎనే సాగునీరందించలేని ఎంఎల్ఎ పదవి ఎందు కని బహిరంగంగా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల ఎదుట అసంతృప్తి వెళ్లగక్కారంటే ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల ఉదాశీన వైఖరిని ప్రతిబింబిస్తోందని చెప్పొచ్చు.

సార్వా సీజన్ ప్రారంభానికి ముందే ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో సాగునీటి సలహా మండలి సమావేశాలను ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు, అధికారుల సమక్షంలో నిర్వహించి కాల్వలకు నీటి విడుదల తేదీ ఖరారు, గోదావరిలో నీటి లభ్యత, ఇతర ఇబ్బందుల గురించి చర్చించారు. సార్వాకు పూర్తిస్థాయిలో సాగునీరందించాలని ఆయా సమావేశాలు నిర్ణయించాయి. అయితే వరిపైరు ఈనిక, పొట్ట దశలో ఉండగా సాగునీటి ఎద్దడి ఏర్పడడం, వర్షాలు ముఖం చాటేయడంతో రైతుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. కాల్వల్లో పూర్తిస్థాయిలో నీరు విడుదల చేసి శివారు ప్రాంతాలకు అందేలా చూడాలని రైతులు ఆయా ప్రాంత అధికారులకు మొర పెట్టుకున్నారు. అయినా స్పందన లేకపోవడంతో సమీప డ్రెయిన్లలో నీటిని ఆయిల్ ఇంజిన్లు పెట్టి తోడి పంటను రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నారు. రైతులు రోడ్డెక్కిన చోట, ఉన్నతాధికారులు జోక్యం చేసుకున్న చోట, ప్రజాప్రతినిధులు, ప్రముఖ నేతలు ఆందోళన చేసిన చోట మాత్రమే కొద్దిరోజులు పూర్తిస్థాయిలో

సాగునీరందక ఎండిపోతున్న పంటలు

నీరందిస్తున్నారని రైతులు వాపోతున్నారు. ఏలూరు జిల్లాలో ముసునూరు, చాట్రాయి, చింతలపూడి, ఉంగుటూరు, పశ్చిమగోదావరి జిల్లాలో ఆచంట, పెనుమంట్ర, పోడూరు, యలమంచిలి, పాలకొల్లు రూరల్ తదితర మండలాల్లో సాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. దీంతో పొలాలు నెర్రలు తీయడం, బీటలు వారడంతో పంటను ఎలా రక్షించుకోవాలో తెలియక చిన్న, సన్నకారు, కౌలురైతులు తలలు పట్టుకుంటున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడిగా పెట్టామని, పంట చేతికొచ్చే దశలో నీటి ఎద్దడి కారణంగా దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా పెట్టుబడులు కూడా వచ్చే అవకాశం ఉండదని వాపోతున్నారు. దీనికితోడు ఎలుకల బెడద, తెగుళ్ల విజృంభణ రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు స్పందించి సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుని నీరందిస్తే కనీసం పెట్టుబడులైనా దక్కించు కుంటామని చెబుతున్నారు. ఇదిలా ఉంటే సాగునీటి సమస్య పట్టని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు ధాన్యం కొనుగోళ్ల ఏర్పాట్లపై చర్చోపచర్చలు సాగిస్తున్నారు. ఇప్పటికీ ఎన్ని వాహనాలు అవసరం, జిపిఎస్, హమాలీల ఏర్పాటు వంటి అంశాలపై సమీక్షలు నిర్వహిస్తూనే ఉన్నారు. ధాన్యం కొనుగోళ్లలో గత దాళ్వాలో రైతులు ఎదురు పెట్టుబడి పెట్టాల్సిన పరిస్థితి నుంచి సక్రమంగా రైతులకు ఇబ్బంది లేకుండా అమ్మకాలు సాగేలా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలకు ఉపక్రమించడం అభినందనీయం. అయితే తేమ శాతంపై మిల్లర్ల లొల్లి నివారణకు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారనేది స్పష్టత లేదు. అలాగే గత దాళ్వాలో రైతులకు అందాల్సిన హమాలీల ఖర్చు సొమ్ము జమలో జాప్యంపైనా చర్చ లేదు. పైగా సాగునీటి కొరతతో అసలు ధాన్యం చేతికొస్తుందో.. లేదో తెలియని పరిస్థితుల్లో రైతులు కొట్టుమిట్టాడుతుంటే ఆ సమస్యను పరిష్కరించడం మాని ఈ సమీక్షలు ఏంటని రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే వర్షాభావ పరిస్థితులు, వ్యవసాయానికి సక్రమంగా విద్యుత్ అందకపోవడం వెరసి పంటలు ఎండి ఏలూరు జిల్లా చాట్రాయి మండలం తదితర ప్రాంతాల్లో పొలాల్లో గేదెలు మేపుతున్నారంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ పరిస్థితులన్నీ పరిశీలిస్తే కచ్చితంగా ముందుగా అంచనా వేసిన దానికన్నా ధాన్యం దిగుబడి తగ్గే అవకాశాలు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఇప్పటికైనా సాగునీటి సమస్యను పరిష్కరించని పక్షంలో దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. ఈ దశలో అధికారులు, ప్రజాప్రతినిధులు పంటను రక్షించుకునేలా సాగునీరు అందించే చర్యలు చేపట్టాలని, వ్యవసాయ విద్యుత్ నిరంత రాయంగా తొమ్మిది గంటలు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో 'రైతులకు సాగునీరందించలేని ఎంఎల్ఎ పదవి ఎందుకు' అని అధికారపక్షానికి చెందిన కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు వ్యాఖ్యానించినట్లు వచ్చే ఎన్నికల్లో రైతులు కూడా ఈ ప్రభుత్వం వద్దనే విధంగా తీర్పునిచ్చే అవకాశం ఉందని రాజకీయ పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.

- వివిఎస్ఎస్‌వి.ప్రసాద్

గర్భిణులు, పిల్లల్లో రక్తహీనత నివారణకు కృషి

డిఎంహెచ్ఒ డాక్టర్ శర్మిష్ఠ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

గర్భిణులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ

గర్భిణులు, చిన్న పిల్లల్లో రక్తహీనతను నివారించేందుకు కృషి చేస్తున్నట్లు జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్.శర్మిష్ఠ తెలిపారు. రక్తహీనత గల పిల్లలకు, గర్భిణులకు పోషకాహారం అందించేందుకు నూతనంగా ప్రవేశ పెట్టిన అక్షజా ప్రోటీన్ మిక్స్ న్యూట్రిషన్ ఫుడ్‌ను అందించే విధానాన్ని క్షేత్రస్థాయిలో ఆమె శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా జీలుగు మిల్లి అంగన్వాడీ కేంద్రంలో పోషకాహారం అందించే విధానాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ గర్భిణులు, రక్తహీనత గల పిల్లలకు ప్రోటీన్ మిక్స్ న్యూట్రిషన్ ఫుడ్ అందించడం ద్వారా ఆరోగ్యంగా, బలంగా ఉంటారని ఆమె అన్నారు. అదేవిధంగా రక్తహీనతతో బాధపడుతున్న, బరువు తక్కువ ఉన్న మూడు నుంచి ఆరు సంవత్సరాల్లోపు వయస్సు గల పిల్లలకు ఐదు నెలలపాటు ఈ ఫుడ్‌ను అందించనున్నట్లు తెలిపారు.

పిహెచ్‌సి సందర్శన

డిఎంహెచ్ఒ జీలుగుమిల్లి పిహెచ్‌సిని సందర్శించి గర్భిణులతో కాసేపు ముచ్చటించారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆసుపత్రిలో సిబ్బంది హాజరును పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో ఐసిడిఎస్ పీడీ కె.విజయలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్ఒ కేథరిన్, డిఎంఒ సుధాకర్, డిఎస్ఒ ఒ.నరేంద్ర, సిడిపిఒ తులసి, పిహెచ్‌సి వైద్యాధికారులు సుష్మ, గాయత్రి, సిబ్బంది శ్రీనివాసరాజు, నాగేశ్వరరావు, మంగ, సువర్ణ పాల్గొన్నారు.

వాలంటీర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - పోలవరం

మండలంలో ఖాళీ అయిన గ్రామ వాలంటీర్ల పోస్టులకు అక్టోబర్ 19 నుంచి 26వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పోలవరం ఎంపిడిఒ జి.శ్రీను పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు అభ్యర్థులు ఏవిధమైన రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. నమోదు చేసుకున్న దరఖాస్తులను అక్టోబర్ 27న పరిశీలిస్తామన్నారు. అక్టోబర్ 28వ తేదీన పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో వారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తామని తెలిపారు. 36వ కమిటీ ద్వారా ఎంపిక కాబడిన నూతన గ్రామ వాలంటీర్లకు అక్టోబర్ 29వ తేదీన నియామక పత్రం అందజేస్తామని తెలిపారు.

ఉపాధి హామీ పనుల గుర్తింపుపై గ్రామసభ

ఉంగుటూరు : గోపీనాథపట్నం సచివాలయం వద్ద శనివారం ఉపాధి హామీ పనుల గుర్తింపుపై ప్రాథమిక గ్రామసభ సర్పంచి పుత్సకాయల విష్ణుమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. గ్రామంలో ఉపాధి పనులు చేపట్టేందుకు అవసరమైన పనులను గుర్తించి సభ దృష్టికి తేవాలని సర్పంచి కోరారు. ముఖ్యంగా రైతులు, ప్రజలు గ్రామాభివృద్ధికి అవసరమైన పనులు పంచాయతీ దృష్టికి తీసుకువస్తే, వాటిని ఈనెల 25న గ్రామంలో ఆమోదించి, అనుమతుల మంజూరు కోసం ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. 33 పనులను ప్రాథమికంగా గుర్తించారన్నారు. ఈ గ్రామసభలో సచివాలయం కన్వీనర్ గంటా లక్ష్మణరావు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి కూరగాయల వితరణ

నూజివీడు రూరల్ : పట్టణం నుంచి తిరుమల తిరుపతి దేవస్థానానికి 12 టన్నులు, ద్వారకాతిరుమలకు 3 టన్నుల కూరగాయలను ప్రత్యేక వాహనంలో రైతులు వితరణగా శనివారం అందించారు. ఈ సందర్భంగా రైతు నక్కా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి నెల భక్తుల నిత్యాన్నదాన కార్యక్రమానికి రైతులు, ప్రజలందరి సహకారంతో వితరణగా అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహకరించిన ప్రతి దాతకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

నూజివీడు రూరల్ : ప్రమాదాల పట్ల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఇఇ ఎ.సత్యనారాయణ హెచ్చరించారు. నూజివీడులో ఆయన శనివారం మాట్లాడుతూ ఇటీవల కాలంలో పల్లెర్లమూడి గ్రామములో పామాయిల్ గెలలు కోసే కార్మికుడు విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన ఘటన విషాదాన్ని నింపిందన్నారు. పర్యవేక్షణా లోపం, నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదాలు సంభవిస్తాయని హెచ్చరించారు. ప్రమాదాల సమాచారాన్ని తక్షణమే అందించాలని, ప్రతి ఒక్కరూ బాధ్యత కలిగి ప్రమాదాలు నివారించాలని తెలిపారు.

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఇంటింటా ప్రచారం

బుట్టాయగూడెం : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ మండలంలోని దొరమామిడి పంచాయతీలో నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు ఆదేశాల మేరకు డోర్ టూ డోర్ తిరుగుతూ బాబుతో నేను కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజవర్గ టిడిపి అధ్యక్షులు పటాన్ రసూల్ ఖాన్, సీనియర్ నాయకులు ఉడతా సత్యనారాయణ(యూకేడి బాబు), మాజీ జెడ్‌పిటిసి సభ్యులు దువ్వెల సంకురుడు, బూత్ ఇన్‌ఛార్జి కాముటి పద్మరాజు పాల్గొన్నారు.

జగనే మళ్లీ సిఎం అవ్వాలి

నేడు కామవరపుకోట నుంచి ద్వారకాతిరుమల వరకు మహా పాదయాత్ర

ఏలూరు టౌన్ : జగన్ మళ్లీ సిఎం అవ్వాలని తన 50వ పుట్టినరోజున కామవరపుకోట - ద్వారకాతిరుమల మహా పాదయాత్రకు ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ శ్రీకారం చుట్టారు. శనివారం ఏలూరు ఎంపీ కార్యాలయంలో విడుదల చేసిన ప్రకటనలో ఈనెల 22న కామవరపుకోట వీరభద్ర స్వామి గుడిలో ఉదయం 8 గంటలకు పూజలు నిర్వహించి, మహా పాదయాత్రను ఎంపీ ప్రారంభిస్తారన్నారు. ఎంపిడిఒ కార్యాలయం తాడిచర్ల మీదుగా దొరసానిపాడు, చిన్న తిరుపతి వెంకటేశ్వర స్వామి దేవాలయానికి పాదయాత్రగా చేరుకుంటారన్నారని తెలిపారు..

జానపద కళలను ప్రోత్సహించాలి

టి.నరసాపురం : జానపద కళలను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ బుర్రకథ కళాకారులు వీరమళ్ల సత్యనారాయణ తెలిపారు. దసరా మహోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని బొర్రంపాలెం గ్రామంలో అభయాంజనేయ స్వామి ఆలయ కమిటీ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్తనశాల బుర్రకథ కాలక్షేపాన్ని ప్రధాన కథకుడిగా వీరమళ్ల సత్యనారాయణ, వంతలుగా ఎడవల్లి ప్రసాదు, ముత్యాలు ఆలపించారు. ఈ బుర్రకథను చిన్నారులు, పెద్దలు ఆసక్తిగా తిలకించారు. ఈ కార్యక్రమంలో బుర్రకథ కళాకారులు బచ్చునంద కుమార్, కమిటీ సభ్యులు జంగాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇంటర్నెట్ వైర్లను సరిచేయాలి : కమిషనర్

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంలో ప్రమాదకరరీతిలో వేలాడుతున్న కేబుల్ నెట్‌వర్క్, ఇంటర్నెట్ వైర్లను సంబంధిత సంస్థల వారు వెంటనే సరిచేయాలని ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో కొన్ని ప్రదేశాలలో కేబుల్ నెట్‌వర్క్, ఇంటర్నెట్ సేవలకు సంబంధించి కేబుల్ వైర్లు ప్రమాదకరరీతిలో వేలాడుతున్నాయని సరిచేయాలని తెలిపారు. ప్రజల ప్రాణాల భద్రత దృష్ట్యా వీటిని తొలగించాలని, లేనిచో నగరపాలక సంస్థ వారు వాటిని తొలగించి, అందుకు ఐన ఖర్చులను సంబంధిత సంస్థల వారికి పంపడం జరుగుతుందన్నారు. అంతేకాక సంబంధిత సంస్థలపై కేసులు కూడా నమోదు చేస్తామని కమిషనర్ వెంకట కృష్ణ హెచ్చరించారు.

ఆనంద తాండవమాడిన కూచిపూడి నాట్యమయూరి

ఏలూరు టౌన్ : దసరా మహోత్సవాల్లో భాగంగా శ్రీశైల దేవస్థానం నందు జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ఏలూరు నగరానికి చెందిన శ్రీపాద శ్రీవల్లభ కూచిపూడి నాట్య నిలయం నాట్య గురువు మేదరమెట్ల శిరీష, శిష్యులు కూచిపూడి నాట్య ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో శివుడు ఆడే ఆనంద తాండవం, శంభో శివ శంభో, గణేష కౌత్వం, రామాయణ శబ్దం భక్తులను విశేషంగా అలరించాయి. నాట్య గురువు ఎం.శిరీష శివుడి పాత్రలో ఆనందతాండవం చేసి అందరి ప్రశంసలను అందుకున్నారు. కార్యక్రమ అనంతరం దేవస్థానం వారు ప్రశంసా పత్రాలు ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ నాట్య ప్రదర్శనలో చిన్నారులు అక్షర, భువనేశ్వరి, గాయత్రి, మేఘన తమ నాట్యంతో మంత్ర ముగ్ధులను చేశారు. ఏలూరు కళారంగం పేరును శ్రీశైలంలో నిలబెట్టినందుకు పలువురు కళారంగ ప్రముఖులు అభినందించారు.

ఎంపిపి లంకా నిర్మలకు మాతృవియోగం

చాట్రాయి : బూరుగు గూడెం గ్రామానికి చెందిన చాట్రాయి మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలు లంక నిర్మల తల్లి లంక సందమ్మ(80) అనారోగ్య కారణాల వలన శనివారం మృతి చెందారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశి రెడ్డి రాఘవరెడ్డి, గ్రామ సర్పంచి దేశిరెడ్డి హైమావతి, వైసిపి మండల అధ్యక్షులు బాలకృష్ణ సందమ్మ పార్థీవదేహానికి నివాళులర్పించారు.

నేరాలు - ఘోరాలు

గంజాయి నిల్వ ఉంచిన వ్యక్తి అరెస్టు

నూజివీడు రూరల్ : మండలంలోని గొల్లపల్లి గ్రామంలో అక్రమంగా నిలువ ఉంచి గంజాయి సేవిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు భక్తుల ఉదయ్ కిరణ్(25)ను అదుపులోనికి తీసుకొని అతని వద్ద నుంచి 1,585 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, సీజ్ చేసినట్లు రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

పేకాటరాయుళ్లు అరెస్టు

ఏలూరు స్పోర్ట్స్ : నగరంలోని పేకాట శిబిరంపై మూడో పట్టణ పోలీసులు దాడి చేసి ఏడుగురు పేకాటరాయలను అరెస్టు చేశారు. ఎన్ఆర్ పేటలో ఓ గృహంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడి నిర్వహించి వారిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.30,500 నగదును స్వాధీనం చేసుకున్నారు.

ట్రావెల్స్ బస్సు ఢీకొని భవాని భక్తుడు దుర్మరణం

భీమడోలు : పెద్దాపురం నుంచి నడుచుకుంటూ విజయవాడ వెళ్తున్న భవాని మాలదార భక్తుడు తూరుపెల్లి మణికంఠ(22) శనివారం తెల్లవారుజామున ట్రావెల్ బస్సు ఢీకొని మృతి చెందాడు. భీమడోలు మండలం కొండ్రెడ్డి నగర్ శివారు వద్ద వెనుక నుంచి వస్తున్న వరపుత్ర ట్రావెల్స్‌కి చెందిన బస్ ఢీ కొట్టింది. తలకు బలమైన గాయమవ్వడంతో మృతిచెందాడు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

రైతులకు సాగు నీరందించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి రవి డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో సకాలంలో సాగునీరు అందక పంటలు పాడైపోతున్నాయని, రైతాంగం తీవ్ర ఆందోళనలో ఉందని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సాగునీటి సమస్యను పరిష్కరించి రైతులకు సక్రమంగా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. సాక్షాత్తు కైకలూరు ఎంఎల్ఎ జిల్లా అభివృద్ధి పర్యవేక్షణ, సమన్వయ కమిటీ సమావేశంలో సాగునీటి సమస్యపై తీవ్ర అసహనం వ్యక్తం చేయడం ద్వారా సమస్య ఎంత తీవ్రంగా ఉందో అర్థం చూసుకోవచ్చని తెలిపారు. వర్షాభావంతో చెరువులు నిండక ఏర్పడిన కరువుతో పంటలకు సాగునీరందక వేలాది ఎకరాల్లో వరి పంట ఎండిపోయి, రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి సాగు చేసిన పంట ఎండిపోవడంతో రైతులు కన్నీరు పెడుతున్నారన్నారు. కరువు పరిస్థితుల పరిశీలనకు అధికారులు, ప్రజాప్రతినిధులు రాకపోవడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికార యంత్రాంగం వెంటనే సమస్య తీవ్రతను గుర్తించి సాగునీరు అందించాలని, పంట నష్టపోయిన రైతాంగానికి ఎకరాకు రూ.30 వేలు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నగర పాలక సంస్థ కౌన్సెల్ సమావేశంలో ప్రజా సమస్యలపై కనీసం చర్చకూడా జరపకపోవడం అప్రజాస్వామికమన్నారు. కౌన్సిల్ సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చ జరిపి పరిష్కారానికి కృషి చేయాల్సిన సభ్యులు చర్చించకపోవడం సిగ్గుచేటన్నారు. అధికార పార్టీ సభ్యులే సగం మంది సర్వసభ్య సమావేశానికి రాకపోవడం చూస్తే అధికార వైసిపికి ప్రజా సమస్యల పరిష్కారంలో ఉన్న చిత్తశుద్ధి అర్థమవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, అధికార పార్టీ, జిల్లా అధికార యంత్రాంగం వెంటనే ప్రజలు, రైతుల సమస్యలపై స్పందించాలని తెలిపారు. లేని పక్షంలో రైతులను, ప్రజలను సమీకరించి సమస్యలపై ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు.

సిపిఎస్, జిపిఎస్‌లను రద్దు చేస్తూ, పాత పింఛన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో జరుగుతున్న నిరవధిక దీక్షలను భగ్నం చేసేందుకు శుక్రవారం పోలీసులు ప్రయత్నించడాన్ని రవి తీవ్రంగా ఖండించారు. ఎన్నికల్లో ఓట్ల కోసం హామీలు ఇవ్వడం, తర్వాత మోసం చేయడం ప్రజాప్రతినిధులకు అలవాటుగా మారిందన్నారు. ఉపాధ్యాయులు చేస్తున్న ఆందోళనకు సిపిఎం మద్దతు ఉంటుందని తెలిపారు.

చేబ్రోలు పోలీస్ స్టేషన్ తనిఖీ

ఉంగుటూరు : చేబ్రోలు పోలీసు స్టేషన్‌ను ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు శనివారం వార్షిక తనిఖీ నిర్వహిం చారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో కేసులపై సమీక్షించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా శాంతి భద్రలపై రాజీ లేకుండా, కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో భీమడోలు సిఐ బివి రవికుమార్, చేబ్రోలు, నిడమర్రు ఎస్ఐలు కాశి స్వామి, ఆర్.శ్రీను పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ సర్పంచి బుజ్జి

రూ.56 లక్షలతో అభివృద్ధి పనులు

ఉంగుటూరు : సమస్యల పరిష్కారానికి సుమారు రూ.56 లక్షల నిధులు కేటాయించిన ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఎంఎల్ఎ చేబ్రోలు గ్రామంలో గతంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎంఎల్ఎ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన నిధులు కేటాయించి వాటితో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించారు. ఈ నేపథ్యంలో శనివారం చేబ్రోలులో వైసిపి కార్యకర్తల సమావేశం ముత్తా బుజ్జి ఆధ్వర్యంలో నిర్వహించి ఎంఎల్ఎకు కృతజ్ఞతలు తెలియజేశారు. జగనన్న హౌసింగ్ లేఅవుట్‌లో ఇల్లు నిర్మించుకున్న వారందరికీ సకాలంలో బిల్లులు మంజూరు చేశారు. ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి తమ వంతు సహకారం అందిస్తామని సమావేశంలో తీర్మానం చేసినట్లు మాజీ సర్పంచి వైసిపి నాయకుడు కర్ణం బుజ్జి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు రాయలసీమ మనసాల నాగమణి, సొసైటీ ఛైర్మన్ పాపారావు బాబ్జి, నాయకులు ఆకుల రాజా, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు జహంగీర్, గ్రామ పార్టీ అధ్యక్షుడు బుజ్జి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పరిశీలన

ఏలూరు : ఈవిఎంలు, వివి ప్యాట్స్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రకియ తీరును జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం కాంపౌండ్‌లో ఉన్న ఈవిఎం గోడౌన్లో ఈవిఎంలు, వివి ప్యాట్స్‌ల ఫస్ట్ లెవెల్ చెకింగ్ తీరు తెన్నులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఫస్ట్ లెవెల్ చెకింగ్ కార్యక్రమంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది, బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి అందుతున్న భోజన సదుపాయాలను కలెక్టర్ ఆరా తీశారు. ఎఫ్ఎల్‌సి నిర్వహణలో సంబంధిత అధికారులు, సిబ్బంది ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. సిబ్బంది తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ధరించాలన్నారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ చల్లన్నదొర ఉన్నారు.

ఆరోగ్య సురక్షను వినియోగించుకోండి

చింతలపూడి : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి తెలిపారు. ప్రగఢవరంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సర్పంచి భూపతి, ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి నీరజాసుధాకర్ అంగన్ వాడీ స్టాల్ పరిశీలించారు.

కలిదిండి : మండలంలోని వెంకటాపురం జిల్లా పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, జెడ్‌పిటిసి బొర్రా సత్యవతి, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, వైస్ ఎంపిపి కట్టా నాగలక్ష్మి పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని బొర్రంపాలెం గ్రామంలోని సురక్షలో డిఎల్‌పిఒ ఎండి రజావుల్లా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల విస్తరణ అధికారి రాంప్రసాద్, చింతలపూడి సబ్ యూనిట్ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని శ్రీహరిపురం సచివాలయం పరిధిలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్షలో ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ, కాకరవాడ, కోమర్రు, శ్రీహరిపురం గ్రామాల సర్పంచులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక త్రివేణి కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపీ కోటగిరి శ్రీధర్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ బేబీ కమల, మున్సిపల్ కమిషనర్ పి.భవాని ప్రసాద్, ఛైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి పాల్గొన్నారు.

జనసేన బలోపేతానికి ధర్మరాజు కృషి

ఉంగుటూరు : నియోజకవర్గంలో జనసేన సభ్యత్వాలు నమోదు, పార్టీ కార్యక్రమాలు ప్రజల్లోకి చురుగ్గా తీసుకెళ్లడంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి పత్సమట్ల ధర్మరాజు క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారని జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ అభినందించారు. మంగళగిరి పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈమేరకు అభినందిస్తూ గతంలోనే నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమితులైన ధ్రువీకరణ పత్రాన్ని ధర్మరాజుకు పవన్‌కళ్యాణ్ అందజేశారు. వచ్చే ఎన్నికల్లో జనసేన, టిడిపి కూటమి గెలుస్తుందని ఆమేరకు మీరంతా మరింత కష్టపడి పనిచేయాలని పిలుపునిచ్చారని ధర్మరాజు శనివారం విలేకర్లకు వెల్లడించారు.

నియామక పత్రాన్ని అందుకుంటున్న ధర్మరాజు

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రజా సమస్యల పరిష్కారానికి సత్వర కార్యాచరణతో ముందుకు వెళుతున్నామని ఎంఎల్ఎ ఆళ్ల నాని తెలిపారు. ఇటీవల పలు డివిజన్‌లలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తుల పరిష్కారాలపై సంబంధిత అధికారులతో ఆయన శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వంలో వచ్చిన అర్జీలను అత్యంత ప్రాధాన్యత అంశంగా పరిగణించి పరిష్కరించాలని ఆదేశించారు. అర్హత కలిగి సంక్షేమ పథకాలు అందని వారికి సదరు సమస్యలు సరిచేసి, పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

రూ.కోటి 10 లక్షల అభివృద్ధి పనులకు ఆమోదం

ఈ సందర్భంగా 3 వ సచివాలయం పరిధిలో రూ.50 లక్షల అభివృద్ధి పనులకు, వెంకటాపురం-1 సచివాలయం పరిధిలో రూ.60 లక్షల అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. ఈమేరకు ప్రాధాన్యతా క్రమంలో పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించిన అన్ని సచివాలయాల పరిధిలో ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులు పరిష్కారమైనది, లేనిది క్షేత్రస్థాయిలో పరిశీలిస్తానని ఆళ్ల నాని తెలిపారు. ఈ మేరకు విజయ దశమి తర్వాత ప్రతిరోజు ఒక సచివాలయంలో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అలసత్వం వహిస్తే ఉపేక్షించబోమని అధికారులను హెచ్చరించారు.

సొంత బిడ్డకన్నా మిన్నగా చూసుకోవాలి

దత్తత కార్యక్రమంలో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

దత్తత తీసుకున్న చిన్నారి ఆలనా పాలనలో సొంతబిడ్డ కన్నా మిన్నగా చూసుకోవాలని దత్తత అర్జీదారులకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సూచించారు. ఏలూరు శిశుగృహంలో ఉన్న 4 నెలల చిన్నారి బేబీ చంద్రికను స్థానిక కలెక్టరేట్‌లో మహారాష్ట్రకు చెందిన దత్తత అర్జీదారులు శ్రీనివాస్ దేశముఖ్, అశ్విని దేశముఖ్ దంపతులకు శనివారం జిల్లా మేజిస్ట్రేట్, కలెక్టర్, జిల్లా దత్తత అధికారి వారి సమక్షంలో దత్తత ఇవ్వడమైనది. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ చిన్నారికి ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని, చిన్నారికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు తెలియజేయాలన్నారు. దత్తత తీసుకున్న తల్లిదండ్రులు చిన్నారి చంద్రికను బాగా చదివించి, మంచి భవిష్యత్ కల్పించాలని కోరారు. చట్ట ప్రకారం అన్ని అర్హతలతో దత్తత అర్జీ దారులు 2020లో ఆడ పిల్ల కోసం దరఖాస్తు చేసుకోగా శనివారం బేబీ చంద్రికను దత్తత స్వీకరణ మార్గదర్శకాలకు అనుగుణంగా వారికి అప్పగించారు. దత్తత తీసుకున్న శ్రీనివాస్ దేశముఖ్ బ్యాంకు ఏజెంట్‌గా పనిచేస్తుండగా, అశ్విని దేశముఖ్ గృహిణిగా వున్నారు. ఈ కార్యక్రమంలో మహిళాభివృద్ధి, శిశ సంక్షేమ, సాధికారతాధికారి కె.పద్మావతి, డిసిపిఒ సిహెచ్.సూర్య చక్రవేణి, బాలల రక్షణాధికారి ఆర్.రాజేష్ పాల్గొన్నారు.

హేలాపురి బాలోత్సవ సావనీర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఏలూరు

హేలాపురి బాలోత్సవం మూడవ పిల్లల సంబరాల సావనీర్‌ను జిల్లా ఎస్‌పి డి.మేరీ ప్రశాంతి చేతుల మీదుగా శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ పిల్లలలో సృజనాత్మకత పెంచడానికి పెద్దలు పూనుకుంటున్నందుకు అభినందించారు. ఎంఎల్‌సి షేక్ సాబ్జీ మాట్లాడుతూ ఏలూరు పరిసర 6 మండలాలకు చెందిన విద్యార్థులు రోజుకు నాలుగు వేల మంది పాల్గొనేలా రెండు రోజులు పెద్దలు అందరూ కలిపి నిర్వహిస్తున్న కార్యక్రమం గురించి వివరించారు. నాలుగవ పిల్లల సంబరాల కార్యక్రమం డిసెంబర్ 16, 17 తేదీల్లో జరగబోతున్నట్టు తెలిపారు. ఎస్‌పి కార్యాలయంలోని సావనీర్ ఆవిష్కరణ కార్యక్రమంలో హేలాపురి బాలోత్సవం గౌరవాధ్యక్షులు, టీచర్స్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ, బాలోత్సవం కమిటీ అధ్యక్షులు ఆలపాటి నాగేశ్వరరావు, కార్యదర్శి గుడిపాటి నరసింహారావు, కమిటీ సభ్యులు ఆనంద నాయుడు, జి.నీలిమ, ఎం.అజయ్ బాబు పాల్గొన్నారు.

సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్‌పి, ఎంఎల్‌సి, జివిఎల్

నష్టపోయిన పంటలకు పరిహారమివ్వాలి

చింతలపూడి : వరి సాగు చేస్తున్న పొలాలను సర్వే నెంబర్లు ఆధారంగా సర్వే చేసి, ప్రకృతి విపత్తు వలన నష్టపోయిన పొలాలకు ఎకరాకు రూ.20 వేల నష్టపరిహారం ఇవ్వాలని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చింతలపూడి మండలం, సమ్మిటివారిగూడెం, మల్లాయగూడెం గ్రామాల్లో ఎపి రైతు సంఘం, సిపిఐ ఆధ్వర్యంలో పంట నష్టపోయిన పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కృష్ణ చైతన్య మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడక నష్టపోయిన వరి పంటను రెవెన్యూ అధికారులు, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి, పంట నష్టం ఎన్ని ఎకరాల్లో జరిగిందో ప్రభుత్వానికి నివేదించాలన్నారు. అనంతరం ఎపి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ మాట్లాడుతూ మండలంలోని సమ్మెటవారి గూడెం, మల్లాయగూడెం, పోతునూరు, ప్రగఢవరం, ఉర్లగూడెం గ్రామాల్లో పూర్తిగా వరి పంట ఎండిపోయే స్థాయికి వచ్చిందన్నారు. మండలంలో సుమారు మూడు వేల ఎకరాల్లో నష్టం జరిగిందని, దీనిని రెవెన్యూ, వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సర్వే నెంబర్ ఆధారంగా నష్టాన్ని అంచనా వేయాలని తెలిపారు. ఈ పర్యటనలో సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, ఎపి రైతు సంఘం నాయకులు రావెళ్ల రాజా, తక్కెలపాటి ప్రసాద్, వంగళ్లపూడి ఆదినారాయణ పాల్గొన్నారు.

ఘనంగా పోలీసు అమరవీరుల దినోత్సవం

పోలవరం : పోలవరం సిఐ కె.విజయబాబు ఆధ్వర్యంలో అసాంఘిక శక్తులతో పోరాడుతూ అసువులు బాసిన పోలీసు అమర వీరులకు శనివారం ఘనంగా నివాళులర్పించారు. పోలవరం మెయిన్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహించి, పోలీస్ అమరవీరులకు జోహార్ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐ విజయబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ రైటర్ కె.శ్రీనివాసు, కానిస్టేబుల్ గంగరాజు, దుర్గాప్రసాద్, సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కలిదిండి : పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని మూలలంకలో కర్రి మనోజ్ కుమార్ విగ్రహానికి కైకలూరు నియోజకవర్గ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, సర్పంచి మహాదేవ విజయబాబు, సొసైటీ అధ్యక్షులు నామాని అన్నవరం, ఎఎంసి ఉపాధ్యక్షులు పాము రవికుమార్ పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా శనివారం జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. సర్కిల్ కార్యాలయం నుంచి సెంటర్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ వెంకటేశ్వరావు, పాల్గొన్నారు.

ముదినేపల్లి : పోలీసు అమర వీరుల దినోత్సవం సందర్భంగా శనివారం ముదినేపల్లి ఎస్ఐ వెంకట కుమార్‌ను మండల బిజెపి నేతలు సత్కరించారు.

'సన్నగిల్లుతున్న ఆశలు'

మండవల్లి : ఇండ్ల స్థలాలు మెరక చేస్తామని హామీ ఇచ్చి మెరక చేయకపోవడంతో సొంతింటి కల ఆశలు సన్నగిల్లి పోతున్నాయని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక నాగేంద్ర స్వామి వారి కళ్యాణ మండపంలో మండవల్లి గ్రామసభ శనివారం సర్పంచి మెండ జాన్సీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ గ్రామ సభలో ఎంపిపి పెద్దిరెడ్డి శ్రీరామ దుర్గాప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాజకీయం కోసమే పేదలకు ఇచ్చిన స్థలాలను మెరక చేయకుండా చేస్తున్నారని లబ్ధిదారులు ఆరోపించారు. వీటిపై కార్యదర్శి మాట్లాడుతూ పంచాయతీలో నిధులు లేని కారణంగా పనులు చేయలేకపోయామని నిధులు చూసుకొని పనులు నిర్వహిస్తామని చెప్పడంతో గ్రామస్తులు ఒక్కసారిగా ధ్వజమెత్తారు.సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కార్యదర్శికి సూచించారు.

కౌన్సిల్ సమావేశాలు చెల్లవు : జనసేన

ఏలూరు : ఈనెల 19వ తేదీన ఏలూరు నగరపాలక సంస్థ కౌన్సెల్ సమావేశంలో చేసిన తీర్మానాలు చెల్లవని జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధికార ప్రతినిధి, ఏలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పలనాయుడు తెలిపారు. జనసేన నియోజకవర్గ కార్యాలయంలో శనివారం రెడ్డి అప్పలనాయుడు మీడియాతో మాట్లాడుతూ లోకల్ బాడీ యాక్ట్ గురించి మేయర్‌కు, పాలకవర్గానికి, ఎంఎల్ఎకు తెలుసా అని ప్రశ్నించారు. మున్సిపల్ యాక్ట్ ప్రకారం ఆరు నెలల్లో కౌన్సెల్ సమావేశం ఏర్పాటు చేయాల్సి ఉండగా ఆరు నెలలు దాటిన తర్వాత కౌన్సెల్ సమావేశం ఏర్పాటు చేశారన్నారు. 29 మార్చి 2023న కౌన్సెల్ సమావేశం జరిగిందని, తిరిగి 19 అక్టోబర్ 2023న కౌన్సెల్ సమావేశం నిర్వహించారన్నారు. గడువు తీరిన తర్వాత కౌన్సెల్ సమావేశం నిర్వహిస్తే ఆ సమావేశంలో చేసిన తీర్మానాలతో పాటు కౌన్సెల్ కూడా రద్దు అవుతుందని తెలిపారు. రెండోసారి బాధ్యతలు నిర్వహిస్తున్న మేయర్, ఎంఎల్ఎలు చట్టాలను గౌరవించడం లేదన్నారు. చట్టానికి విరుద్ధంగా కౌన్సెల్ సమావేశాలు ఏర్పాటు చేసి, తీర్మానాలు చేస్తే అవి చెల్లవని స్పష్టం చేశారు. కౌన్సెల్ సమావేశం, తీర్మానాలపై మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీకి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. కౌన్సెల్ సమావేశం ఎన్ని రోజులకు ఏర్పాటు చేయాలో తెలియని స్థితిలో ఉన్న ఆళ్ల నాని ఎంఎల్ఎ పదవికి అనర్హుడని రెడ్డి అప్పలనాయుడు తెలిపారు.రాష్ట్రంలో అభివృద్ధి లేదని, గంజాయి, లిక్కరు, శాండ్, మైనింగ్ మాఫియాలు రెచ్చిపోతున్నాయన్నారు. అరాచక, దోపిడీ ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు.

రొయ్యలు మృత్యువాత

మండవల్లి : చెరువుల్లో విష ప్రయోగం జరిగి రొయ్యలు మృత్యువాత పడి లక్షలాది రూపాయల నష్టం వాటిల్లిన సంఘటనపై రైతులు పోలీస్ స్టేషన్ ఆశ్రయించిన సంఘటన ఇంగిలంపక లంకలో శనివారం చోటుచేసుకుంది. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రామకృష్ణ తెలిపారు.

రూ.10 వేలు వేతనం ఇవ్వాలి : సిఐటియు

ఏలూరు అర్బన్ : మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు ఇవ్వాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల జిల్లా కమిటీ సమావేశం శనివారం ఏలూరులోని సిఐటియు జిల్లా ఆఫీసులో జరిగింది. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య పాల్గొన్నారు.

ప్రతి ఎకరాకూ సాగునీరందిస్తాం

ఏలూరు టౌన్ : వ్యవసాయ పంటల దశలను, నీటి అవసరాలకు అనుగుణంగా పంటలకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకుంటామని జెడ్‌పి ఛైర్మన్ పద్మశ్రీ ప్రసాద్ హామీ ఇచ్చారు. శనివారం పెదపాడు మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో మండల స్థాయి ప్రత్యేక వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి పారుదల డిఇ మాట్లాడుతూ నీటి సరఫరా విడతల వారీగా అందించటం జరుగుతుందన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి రామకృష్ణ, ఎంపిపి బత్తుల రత్నకుమారి, మాట్లాడుతూ నీటి ఎద్దడి ఏర్పడిన ప్రాంతాలను ఎఎంసి ఛైర్మన్ అప్పన్న ప్రసాద్ మాట్లాడారు.

పేరు మార్పు

పశ్చిమ గోదావరి జిల్లా, పెంటపాడు మండలం, పెంటపాడు గ్రామం, హెచ్.నెం. 4-29, వెలమపేట కాపురస్తులు లేటు శిరపు సుబ్బారావు గారి సతీమణి శిరపు సింహాచలం అనే శిరపు సింహాచలము తెలియజేయునది ఏమనగా నా ఆధార్ కార్డు నందు నా పేరు **శిరపు సింహాచలము** గా ఉంది. కావున ఇకపై నా పేరును **శిరపు సింహాచలం** అనే **శిరపు సింహాచలము** గా పరిగణించవలెనని తెలియజేయుచున్నాను.

శిరపు సింహాచలం అనే శిరపు సింహాచలము
హెచ్.నెం. 4-29, వెలమపేట, పెంటపాడు, పెంటపాడు మండలం, పశ్చిమ గోదావరి జిల్లా.

In The Court Of The Hon'ble 7th Additional District Judge Cum Family Court Judge West Godavri :: Eluru
O.S.No. 68/2021

Between:
Sukhavasi Srinivasa Rao & anothers ***...Plaintiffs***
AND
Gorrela Prasad & 2 Others ***...Defendants***

2nd Defendant: Velagala Lakshmi Subhashini @ Gorrela Subhasani, W/o. Ravi Kumar, Cultivation, R/o. D.No. 2-11, Sitharampuram, Chakraigudem, Pedavegi Mandal, W.G.Dist.

అను వారికి నోటీసులు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట **ది.31-10-2023 ఉదయం గం|| 10:30 ని||లకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలుపుకొనగలరు.** లేని ఎడల తమ పరోక్షమున సంగతులు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

B.A.REDDY
B.J.REDDY, Advocates,
Eluru. Cell: 97032 34999

In The Court Of The Hon'ble 7th Additional District Judge Cum Family Court Judge West Godavri :: Eluru
I.A.No. 29/2022, O.S.No. 68/2021

Between:
Sukhavasi Srinivasa Rao & anothers ***...Petitioners***
AND
Gorrela Prasad & 2 Others ***...Respondents***

2nd Respondent: Velagala Lakshmi Subhashini @ Gorrela Subhasani, W/o. Ravi Kumar, Cultivation, R/o. D.No. 2-11, Sitharampuram, Chakraigudem, Pedavegi Mandal, W.G.Dist.

అను వారికి నోటీసులు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట **ది.31-10-2023 ఉదయం గం|| 10:30 ని||లకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలుపుకొనగలరు.** లేని ఎడల తమ పరోక్షమున సంగతులు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

B.A.REDDY
B.J.REDDY, Advocates,
Eluru. Cell: 97032 34999

In The Court Of The 1st Additional Junior Civil Judge-Cum-1st Additional Judicial Magistrate of 1st Class, Tadepalligudem
O.S.No. 491/2021

In Between:
Yempalla Suhasini ***...Plaintiff***
AND
Marapatla Jyothi and another ***...Defendants***

1st Defendant /Respondent: Smt. Marapatla Jyothi, W/o. Late Suneel Kanth, Female, Aged 40 Yrs, R/o. Opp. RCM Church, Chinanindrakolanu Village, Nidamarru Mandal, Eluru Dist.

పై నెంబరు దావాలో వాది 1వ ప్రతివాది అయిన మీపై దావా దాఖలు చేసినప్పటి నుండి 1వ ప్రతివాది అయిన మీరు ఎన్ని పర్యాయములు నోటీసు పంపినప్పటికి మీరు తీసుకొనని కారణంగా శ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా 1వ ప్రతివాది అయిన మీకు నోటీసులు అమలు నిమిత్తం **ది.07-11-2023వ తేదీ సం||రం వాయిదా వేసియున్నారు.** ఆరోజున ఉదయం గం|| 10:30 ని||ల లగాయితూ మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు ఉన్న ఎడల తెలుపుకొనవలెను. లేని ఎడల మీపరోక్షముగా తీర్మానించబడును.

INJETI RAJESH
Advocate, Tadepalligudem.
Cell: 99120 17174